చురుగ్గా ఓటర్ల సర్వే ప్రక్రియ

- ఇంటి నంబర్ లేని ఓట్లు
- జంక్ క్యారెక్టర్స్ ఉన్న ఇంటి నంబర్లు
- నియోజకవర్గంలో 2,08,909 మంది ఓటర్లు

పెద్దాపురం: దేశ భవితను నిర్ణయించే శక్తి ఓటు హక్కుకు ఉంది. అలాంటి హక్కు ఉన్న ఓటర్ల జాబితా రూపొందించడం ఓ బృహత్కార్యం. ఈ క్రమంలో 2024లో జరగనున్న ఎన్నికలకు ఎన్నికల కమిషన్ ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. జూలై 21న ప్రారంభమైన ఈ డ్రైవ్‌లో బూత్ స్థాయి అధికారులు, ఏజెంట్లు గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ ఓటర్ల వివరాలు సేకరించారు. నియోజవకర్గంలో మొత్తంగా 2,08,909 మంది ఓటర్లు ఉన్నట్టు తేలింది. ఆర్డీఓ జేఎస్ రామారావు నేతృత్వంలో నియోజకవర్గంలో నూరు శాతం సర్వే పూర్తి చేశారు.

పెద్దాపురం డివిజన్ పరిధిలో ప్రత్తిపాడు, తుని, జగ్గంపేట, పెద్దాపురం నియోజకవర్గాల్లో ఓటర్ల సర్వే చురుగ్గా సాగుతోంది. పలు సాంకేతిక కారణాలతో ఇంటి నంబర్ సున్నా(0), జంక్ క్యారెక్టర్‌తో నమోదైన వాటిని సరిదిద్దుతున్నారు. సదరు ఓటరుకు సంబంధించి ఇంటి నంబర్ ఆధారం (ఆధార్, పాస్‌పోర్టు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ తదితర కార్డులు)గా నకలు తీసుకుని, ఫారం–8 ద్వారా సరి చేస్తున్నారు. ఒకే ఇంటి నంబర్‌తో పది మందికి మించి ఉంటే వారికి వేరే ఇంటి నంబర్ కేటాయిస్తామని



ఓటర్ల సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ, ఆర్ఓ జేఎస్ రామారావు

ఎన్నికల అధికారులు చెబుతున్నారు.

పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్

ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఓటరు జాబితా సవరణ ప్రక్రియ జూలై 21 నుంచి ప్రారంభమైంది. ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 29 వరకు పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్, జాబితా సవరణ, సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 16 వరకు ముసాయిదా ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియ, 17న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ చేయనున్నారు. అక్టోబర్ 17 నుంచి నవంబర్ 30వ తేదీ వరకూ ఓటరు జాబితా సవరణపై అభ్యంతరాలను స్వీకరించి డిసెంబర్ 28 నాటికి పరిష్కరిస్తారు. 2024 జనవరి 1వ తేదీన ఓటర్ల జాబితా సిద్ధం చేస్తారు. 2024 జనవరి 5వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. ఓటర్ల జాబితా సర్వేతో పాటు నూతన ఓటర్లను నమోదు చేస్తున్నారు.

నిష్పక్షపాతంగా ఓటరు జాబితా సర్వే



ఓటరు జాబితా సర్వే నిష్పక్షపాతంగా జరిపాం. ఓటరు జాబితాపై ఎటువంటి అపోహలకు చోటు లేదు. కొత్త ఓటర్లను కూడా నమోదు చేస్తున్నాం. సర్వే ద్వారా శాశ్వతంగా వలస వెళ్లిన, మృతి చెందిన, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు ఉన్న, కొత్తగా వలస వచ్చిన వారిని గుర్తించి ఓటరు జాబితాలో చేరుస్తాం.

– జేఎస్ రామారావు, ఆర్డీఓ, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, పెద్దాపురం

నియోజకవర్గ ఓటర్లు, జంక్ నెంబర్ల వివరాలు

మండలం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం	సున్నా నంబర్లు	జంక్ నంబర్లు	పీఎస్‌లు
పెద్దాపురం రూరల్	29590	29167	2	58759	0	0	58
పెద్దాపురం అర్బన్	19216	20830	6	40058	0	0	36
సామర్లకోట రూరల్	33821	34182	3	68006	1	0	69
సామర్లకోట అర్బన్	20371	21713	2	42086	0	0	27

క్లుప్తంగా

వలంటీరు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సామర్లకోట: మండల పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీరు పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ డి.శ్రీలలిత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జి.మేడపాడులో ఖాళీగా ఉన్న రెండు పోస్టులు, పనసపాడులో మూడు వలంటీరు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. 10వ తరగతి అర్హత కలిగి ఆసక్తి కలిగిన స్థానికులు ఈ నెల 21వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త మునిరత్నం

పెద్దాపురం: స్థానిక పరిశోధనా కేంద్రంలో ఇస్తున్న శిక్షణను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ పి.మునిరత్నం అన్నారు. స్థానిక ఏరువాక కేంద్రంలో బుధవారం అభ్యుదయ రైతులకు 'ప్రధాన పంటలు–కీలక యాజమాన్య పద్ధతులు' అంశంపై శిక్షణా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ పి.మునిరత్నం మాట్లాడుతూ వ్యవసాయ పరిశోధనా కేంద్రం, ఏరువాక కేంద్రాల్లో జిల్లాలోని రైతులకు పలు అంశాలపై శిక్షణనిస్తున్నామన్నారు. కో–ఆర్డినేటర్ నరసింహరావు ప్రస్తుత వ్యవసాయ స్థితిగతులను కార్యక్రమంలో శాస్త్రవేత్తలు నందకిషోర్, శర్మ, సుధీర్, రమణారావు, సుజాత, అనూష తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ప్రభుత్వ భవన నిర్మాణాలు



గోర్సలో గ్రామ సచివాలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారుల

కొత్తపల్లి: మండలంలో ప్రభుత్వ భవనాల నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయని మండల ఇంజినీరింగ్ అధికారి జి.శ్రీనివాస్ అన్నారు. మండలంలోని గోర్సలో జరుగుతున్న గ్రామ సచివాలయ భవనం నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే 90 శాతం సచివాలయం పనులు పూర్తయ్యాయి. అభివృద్ధి పనుల పర్యవేక్షణకు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం వివిధ స్థాయిలో అధికారులు పరిశీలిస్తున్నారు. ముఖ్యంగా గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షించి పనులు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు నిర్దేశించిన లక్ష్యం మేరకు పూర్తి చేసేలా తమ వంతు కృషి చేస్తున్నామన్నారు.

రాష్ట్ర స్థాయి యూత్ ఫెస్టివల్ పోటీలకు ఎంపిక



ఫోక్ డాన్స్‌లో ఉమ్మడి జిల్లాలో ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థినులు

సామర్లకోట: స్థానిక భావయామి ఇన్స్టిట్యూషన్స్ ఆఫ్ ఆర్ట్స్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి యూత్ ఫెస్టివల్ పోటీలకు ఎంపికయ్యారు. రాజమహేంద్రవరం ఉమ్మడి జిల్లాలో నిర్వహించిన ఫోక్ డాన్స్ విభాగంలో జిల్లా స్థాయి యూత్ ఫెస్టివల్ పోటీల్లో సామర్లకోట విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. ఎంపికైన విద్యార్థినులు విజయ, లాస్య, శ్రీవల్లి, అభినయ, లీలాశ్రీ, యామినిలను స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్ అసోసియేషన్ కార్యదర్శి గంజి బూరయ్య, చిత్తూలూరి వీర్రాజులు అభినందించారు.

హుండీల ఆదాయం రూ.14.20 లక్షలు



సామర్లకోట పంచారామ క్షేత్రంలో హుండీల సొమ్ము లెక్కిస్తున్న భక్తులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన కుమారా రామభీమేశ్వరస్వామి ఆలయంలో హుండీల ద్వారా రూ.14,20,570 ఆదాయం వచ్చినట్లు ఈఓ డి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. ఆరు నెలల 10 రోజుల తరువాత దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఫణికుమార్ ఆధ్వర్యంలో హుండీలను బుధవారం లెక్కించారు. హుండీల లెక్కింపు కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యులు యండమూరి వెంకటసుబ్బారావు, కర్రి వెంకటలక్ష్మి, నాతిపాముల సూరిబాబు పాల్గొన్నారు.

వారం రోజుల్లో పనులు పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా

సామర్లకోట: స్థానిక ఈటీసీ లేవుట్‌లోని జగనన్న కాలనీలో పనులన్నీ వారం రోజుల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బుధవారం జగనన్న కాలనీలో జరుగుతున్న పనులను హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబుతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటికే గృహ ప్రవేశాలు చేసుకున్న అనేకమంది కలెక్టర్‌ను కలిసి తాగునీరు రాకపోవడం వల్ల ఇబ్బందులకు గురవుతున్నామంటూ మొరపెట్టుకున్నారు. దీంతో పబ్లిక్ హెల్త్ డీఈ హుస్సేన్ తీరుపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయంత్రానికల్లా తాగునీరందేలా చేసి తనకు ఫొటో పెట్టాలని ఆదేశించారు. అదేవిధంగా ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు, షోక్ ఫిట్స్ నిర్మాణాలు పూర్తి కాకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడం లేదని తెలిసి హౌసింగ్ పీడీ సుధాకర్ పట్నాయక్, డీఈ రాజ్ కుమార్‌లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహించడం తగదని హెచ్చరించారు. కాలనీలో ఏర్పాటుచేసిన గణేష్ శిబిరానికి కలెక్టర్ కృతికా శుక్లా వెళ్లి పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, డీఎల్‌డీఓలు పి.నారాయణ మూర్తి, ప్రసాద్, ఎంపీడీఓ డి.శ్రీలలిత, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు తదితరులు పాల్గొన్నారు.



సామర్లకోటలోని జగనన్న కాలనీని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు

పేదల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు

- రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు
- పనసపాడులో గడప గడపకూ మన ప్రభుత్వం

సామర్లకోట: పేదల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు చేరుతున్నాయని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. బుధవారం ఆయన పనసపాడులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నామన్నారు. సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే పరిపాలన తీసుకొచ్చారన్నారు. హామీలు ఇచ్చి మరిచిపోయిన నాయకులను చూశామని, అయితే ఎలాంటి హామీ ఇవ్వని పథకాలు సైతం అమలు చేస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నాలు జరుగుతాయని ప్రజలు గమనించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, పెద్దాపురం జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ ములసా శ్రీను, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, మార్కెట్ కమిటీ వైస్ చెర్మన్ మోరంపూడి రమేష్, సొసైటీ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని, మానేపల్లి చిట్టిబాబు, బదిరెడ్డి బుజ్జి, కాళ్ల శ్రీనివాస్, అనుసూరి రమణ, ఎంపీడీఓ డి.శ్రీలలిత, పంచాయతీ కార్యదర్శి అమరనాథ్‌రెడ్డి, పేర్నిడి రాయుడు, ఎంపీటీసీ సభ్యుడు రాయి వెంకటేశ్వర రావు, ఉపసర్పంచ్ యవర్న చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పనసపాడులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు

నిమజ్జనం వేళ నిబంధనలు తప్పనిసరి



ఉప్పాడ తీరప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ, డీఎస్పీ తదితరులు

కొత్తపల్లి: గణపతి నిమజ్జనాల్లో ప్రతి ఒక్కరూ నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ అన్నారు. మండలంలోని ఉప్పాడ, కోనపాపపేట తీరప్రాంతాలను బుధవారం డీఎస్పీ పడాల వెంకట మురళీకృష్ణారెడ్డితో కలిసి పరిశీలించారు. నిమజ్జనంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. నిమజ్జన సమయంలో భక్తులు తగిన జాగ్రత్తలపై మైకుల ద్వారా తెలియజేయాలని, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. తీరప్రాంతాల్లో అత్యవసర వైద్య బృందాలను ఉంచుతున్నారు. గుర్తించిన తీరప్రాంతాలలోనే నిమజ్జనాలు చేయాలని సూచించారు. ఉత్సవ నిర్వాహకులు నిమజ్జనాలు చేసే తేదీ, సమయాలను తెలియపరచాలన్నారు. తీరంలో తాగునీరు, పారిశుధ్యం, లైటింగ్, గజ ఈతగాళ్లను సిద్ధం చేయాలన్నారు. పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, ఎస్సై స్వామినాయుడు, తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో అబ్రహం లింకన్ తదితరులు ఉన్నారు.

గణనాథునికి ప్రత్యేక పూజలు



గణనాథునికి పూజలు చేస్తున్న భక్తులు

కొత్తపల్లి: మండలంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. వాకతిప్ప శాలివాసా పద్మశాలీ రామాలయం వద్ద, కుతుకుడుమిల్లిలో గణపతి విగ్రహానికి రామ్ గణేష్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో చెరకు గెడలతో మందిరాన్ని అలంకరించి తొండం ఆకారంలో చెరకు ముక్కలతో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండల పరిధిలో ఉప్పాడ, మూలపేట, కొండెవరం, గోర్స, కొమరగిరి, నాగులపల్లి తదితర గ్రామాల్లో గణపతి ఆలయాల వద్ద స్వామికి పంచామృత అభిషేకాలు, వివిధ రకాల పూలు, పత్రులతో అభిషేకాలు చేస్తున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు

సామర్లకోట: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురిని మంగళవారం రాత్రి అరెస్టు చేసి బుధవారం కాకినాడ కోర్టుకు హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించినట్లు సీఐ కె.దుర్గాప్రసాద్ తెలిపారు.

పొలంబడితో అనేక ప్రయోజనాలు

పిఠాపురం: పంట పొలాల్లో వ్యవసాయ అధికారులు నిర్వహించే పొలంబడి వల్ల రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని అగ్రికల్చర్ ఫెర్టిలైజర్స్ డీలర్స్ డిప్లమో కోర్సు కో ఆర్డినేటర్ బి సత్యనారాయణ అన్నారు. బుధవారం గొల్లప్రోలు మండలం చేబ్రోలులో నిర్వహించిన పొలంబడిలో ఈ కోర్సు సిబ్బందికి పలు సూచనలిచ్చారు. వరి పంటలను సందర్శించిన వారు పంట సాగులో తీసుకోవాల్సిన మెళకువలను సూచించారు. పంట పొలాల్లో క్షేత్రస్థాయిలో నిర్వహించే పొలంబడి ద్వారా రైతులకు తగిన సూచనలు సలహాలు అందించడం జరుగుతుందన్నారు. పంటలను పరిశీలించి మంచి దిగుబడి సాధించడానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించడం ద్వారా రైతులకు వ్యవసాయ శాఖ అండగా నిలుస్తుందన్నారు. ఏడీఏ పి.స్వాతి, గొల్లప్రోలు వ్యవసాయ శాఖాధికారి వీవీ సత్యనారాయణ, రైతు భరోసా కేంద్రం సిబ్బంది ఓలేటి లక్ష్మిరెడ్డి, శ్యామల, చిన్నారి గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.



పొలంబడిలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న అధికారులు

మానసిక ఎదుగుదలకు క్రీడలు దోహదం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా సహిత విద్యలో శిక్షణ పొందుతున్న ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు వివిధ క్రీడా పోటీలు బుధవారం నిర్వహించారు. స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహించిన పోటీల ప్రారంభ కార్యక్రమానికి ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా కలెక్టర్ కృతికా శుక్లా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ క్రీడలు ప్రత్యేక అవసరాల కలిగిన పిల్లల్లో భావ సమతౌల్యం, మానసిక ఎదుగుదలకు దోహదపడతాయన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు ఏదో ఒక క్రీడలో పాల్గొనేలా ఉపాధ్యాయులు చూడాలన్నారు. పోటీలు నిర్వహిస్తున్న విద్యాశాఖ అధికారులను ఆమె అభినందించారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరెడ్డి మాట్లాడుతూ ఆటలు సమగ్ర మూర్తిమత్వానికి దోహదపడతాయన్నారు. స్లోవాక్, సాఫ్ట్‌బాల్, అథ్లెటిక్స్, అసిస్టెడ్ వాక్, షాట్‌పుట్, లాంగ్ జంప్, డిస్కస్‌త్రో, జావలిన్‌త్రో తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. ముందుగా జాతీయ జెండాను ఎమ్మెల్యే ద్వారంపూడి ఆవిష్కరించారు. పోటీల ప్రారంభ సూచికంగా బెలూన్లు ఎగురవేశారు.

అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

సామర్లకోట: మండలంలోని మాధవపట్నం గ్రామంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ జి.ఉషా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానికులై ఉండి 10వ తరగతి విద్యార్హత ఉన్న జనరల్ మహిళ అర్హులన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఐసీడీఎస్ రూరల్ ప్రాజెక్టు నుంచి దరఖాస్తులు పొంది ఈ నెల 20వ తేదీ లోగా దరఖాస్తులను కార్యాలయంలో అందజేయాలన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 28 మంది ఎంపిక



ఇంటర్వ్యూల్లో ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

సామర్లకోట: స్థానిక వైఆర్‌ఎల్ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 28 మంది ఎంపికైనట్లు కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ వై.రవిచంద్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 50 మంది రాత పరీక్షలో పాల్గొనగా 28 మందిని ఎంపిక చేశారన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ వై.మాణిక్యం, ఎండీ వై.రవిచంద్, ప్రిన్సిపాల్ వై.లావణ్య, ఏఓ దుర్గాప్రసాద్‌లు అభినందించారు.

అంగన్‌వాడీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల

పెద్దాపురం: ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పెద్దాపురం ఐసీడీఎస్ సీడీపీఓ ఉష బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సామర్లకోట మండలం మాధవపట్నం అంగన్‌వాడీ వర్కర్(ఓసీ), పెద్దాపురం మండలం ఆర్‌బీకొత్తూరు గ్రామ హెల్పర్(బీసీ–బీ) పోస్టులకు అభ్యర్థులు ఈ నెల 29వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవొచ్చన్నారు.

ట్రాక్ పాయింట్లపై అవగాహన ఉండాలి



సామర్లకోటలో ట్రాక్ పాయింట్స్‌పై అవగాహన కల్పిస్తున్న స్టేషన్ మేనేజర్ రమేష్

సామర్లకోట: రైల్వే స్టేషన్‌లో పనిచేస్తున్న స్టేషన్ మాస్టర్లు, పాయింట్స్ మాన్‌లకు ట్రాక్ పాయింట్లపై పూర్తి అవగాహన ఉండాలని స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ అన్నారు. ఈ మేరకు స్టేషన్ పరిధిలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఉద్యోగులకు బుధవారం ట్రాక్‌పై శిక్షణ నిర్వహించారు. ఆటోమెటిక్ పాయింట్స్ మొరాయించిన సమయంలో మాన్యువల్ ద్వారా ఒక ట్రాక్ నుంచి మరో ట్రాక్‌కు పాయింట్‌లు మార్చే ఇంటర్ లాకింగ్ విధానంపై అవగాహన కల్పించారు.

ఇద్దరికి రిమాండ్

సామర్లకోట: మండలంలోని వీకే రాయపురం గ్రామంలో సారా అమ్ముతున్న బత్తుల చక్రం, రాయుడు వెంకటలక్ష్మిలను అరెస్ట్ చేసి కాకినాడ కోర్టులో హాజరుపరచగా వారికి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ పీఆర్ఆర్ మూర్తి బుధవారం తెలిపారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష

- వర్షాకాలంలో ప్రాణాంతక వ్యాధులు
- మేకలు, గొర్రెల్లో కాలిపుండు వ్యాధులు

పెద్దాపురం: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పశువులు వ్యాధుల బారిన పడుతుండడంతో రైతులు అనేక వ్యయప్రయాసాలకు గురికావాల్సి వస్తోంది. వర్షాకాలంలో చెరువులు, కుంటలు, వాగులు, బావుల్లో ఒక్కసారిగా నీరు చేరి కలుషితమవుతుంటాయి. కలుషిత నీరు తీసుకోవడంతో పశువులకు వివిధ వ్యాధులు సోకే ప్రమాదముందని పశువైద్యాధికారులు చెబుతున్నారు. ప్రధానంగా మేకలు, గొర్రెల్లో కాలిపుండు వ్యాధి వ్యాప్తి చెందే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు. వ్యాధుల బారిన పడకుండా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలని సూచిస్తున్నారు.

పెద్దాపురం మండలంలో 5,441 మేకలు, 10,165 గొర్రెలు ఉన్నట్లు అధికారులు స్పష్టం చేస్తున్నారు. మేతకు వెళ్ళే మేకలు, గొర్రెల మందలు వర్షాకాలంలో తడవడం, మురికి గుంటలు, నిల్వ ఉన్న నీటిలో అధిక సమయం నిలిచి ఉండడం వల్ల సూక్ష్మ జీవులు వాటి కాళ్ళను ఆశించడంతో వ్యాధి బారిన పడతాయి. అలాగే చిత్తడి నేలల్లో తిరగడం వల్ల ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. దీన్ని ముందుగా గుర్తించకుంటే ఒక మేకకు, లేదా గొర్రెకు వచ్చిన వ్యాధి త్వరగా మందలోని మిగిలిన వాటికి వ్యాపిస్తుంది. ఈ సమస్యలను అధిగమించేందుకు సంబంధిత కాపరులు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్న తమ సిబ్బందిని లేదా పశువైద్య కేంద్రాల్లో వైద్యులను సంప్రదించాలని పశువైద్య సిబ్బంది సూచిస్తున్నారు.



ఆర్‌బీ పట్నంలో మేత మేస్తున్న మేకలు, గొర్రెలు

వ్యాధి లక్షణాలు ఇలా

కాలి పుండు వ్యాధి సోకిన మేకలు, గొర్రెలు తొలుత నడకలో వెనకపడతాయి. అలాంటప్పుడు వాటి గిట్టలను పరిశీలించాలి. గిట్టల మధ్య ఎర్రగా కందినట్లు ఉంటే కాలిపుండు వచ్చినట్లు గుర్తించాలి. ఈ వ్యాధి సోకిన జీవాలు సరిగా మేత మేయవు. బరువు తగ్గుతాయి. గిట్టల మధ్య ఎర్రగా కందిన భాగం ఉబ్బి చీము పడుతుంది. అలాగే తీవ్రమైన చెడువాసన వస్తుంది. వ్యాధి తీవ్రతను బట్టి గిట్టలు ఊడిపోయే ప్రమాదం సైతం ఉంటుంది. ఈ తరహా వ్యాధి లక్షణాలు మేకలు, గొర్రెల్లో గుర్తిస్తే తక్షణమే స్పందించాలి. వ్యాధి సోకిన గిట్టలను 10 శాతం మైలతుత్తం ద్రావణం(కాపర్ సల్ఫేట్) లేదా 10 శాతం జింకు సల్ఫేట్ ద్రావణం లేదా 10 శాతం పొటాషియం పెర్మాంగనేట్ లేక 5 శాతం ఫార్మలిన్ ద్రావణంలో నడిపించి, వాటి కాళ్ళను శుభ్రం చేయాలి. ఇలా రోజుకు రెండు సార్లు చేయడం వల్ల ఫలితముంటుంది. వైద్యుల సూచనల మేరకు యాంటీబయాటిక్ మందులను దాదాపు నెల రోజుల వరకూ పూత పూయాలి. అలాగే అదనంగా పెరిగిన గిట్టలను కత్తిరించాలి.

నియోజకవర్గంలో మేకలు, గొర్రెల వివరాలు

మండలం	మేకలు	గొర్రెలు	మొత్తం
పెద్దాపురం	5,441	10,165	8,620
సామర్లకోట	3,179	9,759	9,824

పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి



మేకలు, గొర్రెల్లో కాలిపుండు వ్యాధి వ్యాప్తి చెందకుండా ఉండాలంటే వ్యాధి సోకిన జీవాలను మంద నుంచి వేరుచేయాలి. మందలను చిత్తడి, నీరు నిలిచే నేలలకు దూరంగా ఉంచాలి. మందను కాసే ప్రదేశాల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలి. ఎప్పటికప్పుడు వైద్యుల సూచనల మేరకు మందులు వేయాలి.

– డాక్టర్ కె.రాకేష్, ప్రభుత్వ పశువైద్యశాల, ఆర్‌బీపట్నం